క్లుప్తంగా

పేదలకు అండగా సీఎంఆర్ఎఫ్



మహబూబాబాద్: పేదలకు అండ సీఎం రిలీఫ్‌ఫండ్ అని ఎంపీ మాలోత్ కవిత అన్నారు. స్థానిక ఎంపీ క్యాంపు కార్యాలయంలో ఆదివారం బయ్యారం మండల కేంద్రానికి చెందిన బి.వెంకటేష్‌కు నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్‌కు సంబంధించిన రూ.2,50,000 విలువ చేసే ఎల్‌ఓసీని వెంకటేష్ కుటుంబ సభ్యులకు ఎంపీ అందజేశారు.

కామారంలో కార్డన్‌సెర్చ్



గంగారం: మహబూబాబాద్ ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆదేశాల మేరకు మండలంలోని కామారంలో గూడూరు సీఐ యాసిన్ ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. కామారం గ్రామాన్ని పోలీసులు అష్టదిగ్బంధనం చేసి ప్రతి ఇంటిలో సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో ప్రభుత్వ నిషేధిత గుడుంబా 10లీటర్లు, రూ.17,460 విలువైన మద్యం, సరియైన పత్రాలు లేని 19 వాహనాలను సీజ్ చేశారు. కార్యక్రమంలో ఎస్సైలు ఉపేందర్, నగేష్, రాణప్రతాప్, దిలీప్, ఆర్ఎస్సై పుల్లారావు, గూడూరు సర్కిల్ సిబ్బంది, మహబూబాబాద్ స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.

క్రికెట్ క్యాంపు సందర్శన



మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 36వ వార్డు సిద్ధార్థ గ్రౌండ్ ఆవరణలో జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా క్రికెట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అజయ్ సారథి రెడ్డి నిర్వహణలో పదిరోజుల నుంచి కొనసాగుతున్న వేసవి క్రికెట్ క్యాంపును మున్సిపల్ కమిషనర్ ప్రసన్నరాణి ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె క్రీడాకారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో కోచ్ మెతుకు కుమార్, ధర్మచరణ్ రెడ్డి, ముజాహిద్, రాజేష్, అనిర్వేష్, చరిత్ రెడ్డి, మన్ను, నవీన్, రంగారావు, విజయేంద్ర పాల్గొన్నారు.

మార్కెట్ చైర్‌పర్సన్ దంపతులకు సన్మానం



కేసముద్రం: కేసముద్రం మార్కెట్ చైర్‌పర్సన్ నీలం సుహాసిని దుర్గేష్ దంపతులను ఆదివారం మండల కేంద్రంలో మండల పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఇటీవల మార్కెట్ చైర్‌పర్సన్‌గా నియమితులైన సందర్భంగా సన్మానించినట్లు పాస్టర్‌లు తెలిపారు. కార్యక్రమంలో పాస్టర్‌లు విక్టర్, ప్రభుజీవన్, మహేందర్, సురేష్, పిల్లి కుమారస్వామి, పిల్లి సారంగపాణి, రూబేన్, సుధాకర్ పాల్గొన్నారు.

కంఠమహేశ్వర స్వామి కల్యాణం



మరిపెడ రూరల్: మరిపెడ మండలం ఎల్లంపేట గ్రామంలో గౌడ కులస్తుల ఆరాధ్యదైవం అయిన కంఠ మహేశ్వర స్వామి వారి కల్యాణ మహోత్సవం శనివారం రాత్రి అంగరంగ వైభవంగా నిర్వహించారు. జిల్లా రైస్ మిల్ అసోసియేషన్ అధ్యక్షుడు డీఎస్ రవిచంద్ర గౌడకులస్తులతో కలిసి స్వామివారికి పూజలు చేశాడు.

బొడ్రాయి వేడుకలు



మహబూబాబాద్ రూరల్: మండలంలోని సికింద్రాబాద్ తండా గ్రామంలో బొడ్రాయి ప్రతిష్ఠ పూజ కార్యక్రమాలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఎంపీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు మాలోత్ కవిత ముఖ్యఅతిథిగా హాజరై బొడ్రాయి, గ్రామ దేవతలను దర్శించుకున్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కేఎస్ఎన్ రెడ్డి దంపతులు, ముత్యం వెంకన్న, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు మహబూబ్ పాషా, ఉపసర్పంచ్ నూనావత్ ఇస్తారి, ఎంపీటీసీ చింతల లలితసైదులు పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీ సేవలు మరువలేనివి

మహబూబాబాద్ రూరల్: భారత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ దేశ ప్రజలకు చేసిన సేవలు మరువలేనివని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్నం శ్రీకాంత్ రెడ్డి అన్నారు. మహబూబాబాద్ మండలంలోని రెడ్యాల గ్రామంలో రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా ఘనంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఆదివారం ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనారిటీ నాయకులు యాకూబ్ పాషా, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నూనావత్ రాధ, జిల్లా ఉపాధ్యక్షులు ఎదల్ల యాదవరెడ్డి, జిల్లా, మండల నాయకులు కత్తి స్వామి, బైరు అశోక్ గౌడ్ పాల్గొన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఆల్ ఇండియా కాంగ్రెస్ పార్టీ ఆదివాసీ వైస్ చైర్మన్ డాక్టర్ తేజావత్ బెల్లయ్య నాయక్ క్యాంపు కార్యాలయంలో రాజీవ్ గాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా కాంగ్రెస్ పార్టీ ఆదివాసీ వైస్ చైర్మన్ డాక్టర్ తేజావత్ బెల్లయ్య, ఓబీసీ జిల్లా అధ్యక్షులు మేకల వీరన్నయాదవ్, ఎస్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్ నాయక్, మాజీ జడ్పీటీసీ సభ్యులు జిన్నారెడ్డి వెంకటేశ్వర్లు పద్మజ, పార్టీ జిల్లా, మండల నాయకులు పాల్గొన్నారు.

గార్ల: దేశ మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ నాయకులు ఆదివారం సీతంపేట రోడ్డులో గల రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ తాళ్లపల్లి కృష్ణగౌడ్, ఎంపీటీసీ సుజాత రామారావు, శంషాద్‌బేగం, అప్పయ్య పాల్గొన్నారు.

గూడూరు: కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు రాజీవ్‌గాంధీ ఆశయ సాధనకు పాటుపడాలని జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు నూనావత్ రాధ అన్నారు. పార్టీ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు మండల అధ్యక్షుడు స్వామి, బీరం శ్రీపాల్‌రెడ్డి, స్వామి, శ్రీనివాస్ పాల్గొన్నారు.



మహబూబాబాద్ రూరల్: నివాళులర్పిస్తున్న వెన్నం శ్రీకాంత్ రెడ్డి, తదితరులు



కేసముద్రం: రాజీవ్‌గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



మహబూబాబాద్ రూరల్: నివాళులర్పిస్తున్న తేజావత్ బెల్లయ్యనాయక్, తదితరులు



గార్లలో..



నెల్లికుదురులో..



పెద్దవంగరలో..



గూడూరులో..



దోర్నకల్‌లో..



బయ్యారం: కొత్తపేటలో..

కేసముద్రం: రాజీవ్‌గాంధీ వర్ధంతిని మండల కేంద్రంలో పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు అంబటి మహేందర్‌రెడ్డి, పోలేపాక నాగరాజు, వసంతరావు, పరాంకుశం శ్రీహరి, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

నెల్లికుదురు: మండల కేంద్రంలో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యుడు హెచ్ వెంకటేశ్వర్లు, కిసాన్ మండల అధ్యక్షుడు సలుగు పూర్ణచందర్, కాంగ్రెస్ మండల అధికార ప్రతినిధి మానేందర్, తదితరులు పాల్గొన్నారు.

దోర్నకల్: స్థానిక గాంధీసెంటర్‌లో రాజీవ్‌గాంధీ వర్ధంతి వేడుకలను నిర్వహించారు. మున్సిపాలిటీ కాంగ్రెస్ పర్యవేక్షకులు హరికృష్ణ, నాయకులు సుమేర్‌చంద్‌జైన్, ప్రవీణ్, ఖాసీం పాల్గొన్నారు.

బయ్యారం: మండలంలో రాజీవ్‌గాంధీ విగ్రహాల పార్టీ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. బయ్యారం, కొత్తపేట గ్రామాలో జిల్లా నాయకులు సురేష్ తదితరుల ఆధ్వర్యంలో పూలమాలలు వేశారు.

పెద్దవంగర: దేశానికి రాజీవ్‌గాంధీ చేసిన సేవలు ఆదర్శప్రాయమని మండల అధ్యక్షుడు ముద్దసాని సురేష్ అన్నారు. రాజీవ్‌గాంధీ వర్ధంతిని నాయకులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు రంగు మురళి, జాన్, సమ్మయ్య, వినోద్, వేణు, తదితరులు పాల్గొన్నారు.

దంతాలపల్లి: మండల కేంద్రంలోగల పార్టీ కార్యాలయంలో రాజీవ్‌గాంధీ వర్ధంతిని కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు బట్టు నాయక్, ఎంపీటీసీ యాకన్న, నాయకులు పాల్గొన్నారు.

గాలివాన బీభత్సం.. తడిసిన ధాన్యం

మరిపెడ రూరల్: మరిపెడ మండలం మూలమర్రితండ గ్రామ పంచాయతీ పరిధిలోని తోప్లతండాకు చెందిన కౌలు రైతు తేజావత్ వాలుకు చెందిన పూరి గుడిసె పై కప్పు శనివారం రాత్రి గాలివాన బీభత్సానికి లేచిపోయింది. దీంతో ఇంట్లో నిల్వ ఉన్న పత్తి తడిసి ముద్దయిందని, అదేవిధంగా ఇంట్లో ఉన్న బియ్యం, దుస్తులు, తదితర వస్తువులు తడిసిపోయాయని రైతు వాపోయాడు. ప్రభుత్వం ఆదుకొని డబుల్ బెడ్రూంఇళ్లు మంజూరు చేయాలని కౌలు రైతు వేడుకున్నాడు.

విద్యుత్‌కు అంతరాయం

దోర్నకల్: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం రాత్రి గాలులు, వర్షంతో చెట్లు కూలి రోడ్లపై పడ్డాయి. పలు వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. వర్షంతో పాటు పెనుగాలులతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. తహసీల్‌దారుబంజర, గొల్లచర్ల, చిలుకోడు, పెరుమాళ్ల సంకీస, మన్నెగూడెం, వెన్నారం కొనుగోలు కేంద్రాల్లో వర్షం నుంచి ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

'పోడు రైతులకు పట్టాలు ఇవ్వడం ఇష్టంలేదు'

గంగారం: సీఎం కేసీఆర్‌కు పోడు రైతులకు పట్టాలు ఇవ్వడం ఇష్టంలేదని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా ఉమ్మడి వరంగల్ జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అసలు పోడు రైతులకు పట్టాలు ఇవ్వటమే కేసీఆర్‌కి ఇష్టం లేదని, అందుకోసమే సబ్ కమిటీలు వేశారని, అవి హడావుడే తప్పా ఆచరణలో అంగుళం ముందుకు వేయలేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడమండలాల కార్యదర్శి పూణెం ప్రభాకర్, కంటి సూర్యం, పైన్ల యాకయ్య, ఈక భిక్షం, కురుసం రంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటు

చిన్నగూడూరు: బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు రోజులు దగ్గర పడ్డాయని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ శాగంటి రమేష్ మాదిగ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ కోసం పోరాటం చేసిన ఘనత ఎమ్మార్పీఎస్ ఉద్యమానికి ఉందని వారిని కించపరుస్తూ బీఆర్ఎస్ తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిశోర్ అనుచిత వ్యాఖ్యలు చేయటం సిగ్గుచేటన్నారు. అహంకారంతో మాట్లాడిన మాటలను వెనక్కి తీసుకుని ఎమ్మార్పీఎస్ సంఘానికి క్షమాపణ చెప్పాలన్నారు. లేనిఎడల ఎమ్మార్పీఎస్ మందకృష్ణ మాదిగ నేతృత్వంలో గాదరి కిషోర్ ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ మండల అధ్యక్షుడు బర్పటి రణధీర్, పోలెపాక ప్రవీణ్, దుడ్డెల కార్తీక్, రాజు, ఉదయ్, అనిల్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రమేష్

గేదెను ఢీకొట్టిన ద్విచక్ర వాహనదారుడు

మహబూబాబాద్ రూరల్: ద్విచక్రవాహనదారుడు గేదెను ఢీకొట్టగా అతడికి తీవ్రగాయాలు కావడంతోపాటు గేదె మృతి చెందిన సంఘటన మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని బేతోలు గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. కురవి ఎస్సై రాము తెలిపిన వివరాల ప్రకారం.. బేతోలు గ్రామ శివారు మాన్ సింగ్ తండాకు చెందిన గుగులోత్ రాజేందర్ తన ద్విచక్ర వాహనంపై బేతోలు గ్రామానికి వస్తున్నాడు. ఈక్రమంలో గేదె జాతీయ రహదారి దాటుతుండగా రాజేందర్ వాహనం ఆ గేదెను ఢీకొట్టింది. ఈప్రమాదంలో అతడికి తీవ్ర గాయాలు కాగా, గేదె అక్కడికక్కడే మృతిచెందింది. వెంటనే స్థానికులు అతడిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించి, మెరుగైన వైద్యం కోసం ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు.



గాయపడిన రాజేందర్

లారీ ఢీకొని కూలీకి తీవ్రగాయాలు

మహబూబాబాద్ రూరల్: లారీ ఢీకొని ఇసుక కూలీకి తీవ్రగాయాలైన సంఘటన జిల్లా కేంద్రంలోని జ్యోతిరావు పూలే జంక్షన్ వద్ద ఆదివారం చోటుచేసుకుంది. బ్లూకోల్ట్స్ పీసీ డీ.నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. ఎర్రమట్టి లోడుతో ఉన్న లారీ వైఎస్సార్ విగ్రహం వైపునుంచి ఆర్‌ఓబీపైకి వెళ్లేందుకుగాను జ్యోతిరావు పూలే జంక్షన్ వద్ద జ్యోతిరావు పూలే జంక్షన్ వద్దకు వచ్చింది. అదేసమయంలో సూర్యాపేట జిల్లా వెలిశాల గ్రామ శివారు మర్రికుంటకు చెందిన ఇసుక కూలీ బానోత్ లింగ్య ఆర్‌ఓబీ వైపు నుంచి కిందకు దిగుతున్నాడు. అంతలోనే లారీ ఆర్‌ఓబీ ఎక్కటం కోసం వేగంగా రావటంతో లింగ్యను ఢీకొంది. ఈ ప్రమాదంలో అతడికి తీవ్రగాయాలు కాగా స్థానికులు, పోలీసులు ఆయనను చికిత్స నిమిత్తం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు.



గాయపడిన లింగ్యా

నిప్పంటుకుని మొక్కజొన్న పంట దగ్ధం



దగ్ధమైన కంకులను చూపుతున్న రైతు

కేసముద్రం: ప్రమాదవశాత్తు నిప్పంటుకుని మొక్కజొన్న పంట దగ్ధమైన సంఘటన మండలంలోని సప్పిడిగుట్టతండా జీపీ శివారు మాన్‌సింగ్‌తండా సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. కేసముద్రం విలేజ్‌కి చెందిన పోలెపల్లి పుల్లారెడ్డికి మాన్‌సింగ్‌తండాలో రెండెకరాలు మొక్కజొన్న పంటను సాగు చేశాడు. తీరా కంకులను విరిచి రెండుచోట్ల రాశులుగా పోశాడు. మొక్కజొన్న చొప్పకు నిప్పంటుకోవడంతో మంటలు వ్యాపించి కంకులు దగ్ధమయ్యాయి. సుమారు రూ.1.50 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.

యువతి అదృశ్యం

గార్ల: కుట్టుమిషన్ వద్దకు వెళ్లి వస్తానని ఇంట్లో చెప్పి వెళ్లిన ఓ యువతి అదృశ్యమైన సంఘటన ఆదివారం పీక్లీతండాలో చోటుచేసుకుంది. ఎస్సై బానోత్ వెంకన్న కథనం ప్రకారం వివరాలిలావున్నాయి. గార్ల మండలం పీక్లీతండాకు చెందిన గౌరిశెట్టి రమేష్ కూతురు గౌరిశెట్టి ప్రత్యూష పాల్వంచ లోని గురుకుల కళాశాలలో డిగ్రీ ప్రథమ సంవత్సరం చదువుతుంది. వేసవి సెలవులు రావడంతో స్వగ్రామైన పీక్లీతండాకు వచ్చింది. 20వ తేదీ సాయంత్రం 4గంటల సమయంలో ప్రత్యూష కుట్టుమిషన్ దగ్గరకు వెళ్లొస్తానని ఇంట్లో చెప్పి వెళ్లింది. రాత్రి వరకు ఇంటికి రాకపోవడంతో తల్లితండ్రులు గ్రామంలో, బంధువుల ఇళ్లలో వెతికినా యువతి ఆచూకీ లభ్యం కాకపోవడంతో తండ్రి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈమేరకు ఎస్సై యువతిపై అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

గుండెపోటుతో రేషన్ డీలర్ మృతి

గార్ల: మండలంలోని రాంపురం పంచాయతీ రేషన్ దుకాణం డీలర్ అజ్మీర సురేష్(35) ఆదివారం ఉదయం ఇంట్లో గుండెపోటుకు గురై మృతిచెందాడు. మృతుడికి భార్య రోజా, ఆరేళ్ల కూతురు సంతానం. డీలర్ సురేష్ భౌతికాయాన్ని సీపీఐ జిల్లా కార్యదర్శి బి విజయసారథి, వైస్ ఎంపీపీ కట్టెబోయిన శ్రీనివాసరావు, మండల కార్యదర్శి జంపాల వెంకన్న తదితరులు సందర్శించి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. గార్ల మండల డీలర్ల సంఘం అధ్యక్షుడు పాపాలాల్ బాధిత కుటుంబానికి రూ.10,000 నగదును అందజేశారు. మృతదేహాన్ని సందర్శించిన వారిలో డీలర్లు పద్మావతి, రమ, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌షాక్‌తో ఎద్దు మృతి

కేసముద్రం: ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్‌కు గురై ఎద్దు మృతిచెందిన సంఘటన మండలంలోని బోడ మంచ్యాతండాజీపీ శివారు గుడితండాలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తండాలో ధరంసోత్ చందా అనే రైతుకు చెందిన ఎద్దును మేతకోసం తన పంటచేను వైపుకు తీసుకెళ్లారు. ఈక్రమంలో స్తంభానికి ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు అమర్చిన ఎర్త్‌పైపు ద్వారా విద్యుత్ సరఫరా అవుతుండటంతో, అటుగా వెళ్లిన ఎద్దు విద్యుత్‌షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందింది. ఎద్దు మృతితో రూ.70వేల నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు తెలిపాడు.

'ఆహ్వానం అందలేదు'

దంతాలపల్లి: మండలంలోని ఆగాపేట గ్రామంలో ఆదివారం డోర్నకల్ ఎమ్మెల్యే రెడ్యానాయక్ చేస్తున్న పలు అభివృద్ధి పనులకు తనకు ఎలాంటి సమాచారం అందలేదని సర్పంచ్ ఇమ్మడి సంధ్య తెలిపారు. గ్రామ సర్పంచ్‌నైనా నాకు ఎలాంటి సమాచారం లేకుండా మీరు గ్రామంలో ఎలా అభివృద్ధి పనులు చేస్తారని వాగ్వాదానికి దిగారు. దీంతో పలువురు సర్పంచికి నచ్చ జెప్పి సభావేదిక పైకి పిలిచారు.

మహాసభలను విజయవంతం చేయాలి



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

గూడూరు: ఖమ్మం జిల్లాలో జూన్ 5,6 వ తేదీలలో జరుగు ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్) తెలంగాణ రాష్ట్ర 2వ మహాసభలను విజయవంతం చేయాలని సంఘం మండల కమిటీ ప్రతినిధి కర్ణాకర్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం మహాసభకు సంబంధించిన వాల్‌పోస్టర్లను నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు అచ్చన్న, నర్సయ్య, వెంకన్న, బుచ్చిరాములు, సోమన్న, దేవేందర్, ప్రభాకర్, చేరాలు, రాజమల్లు, రామచంద్రు, తదితరులు పాల్గొన్నారు.

కొత్తగూడ: జూన్ 5నుంచి జరిగే పీవైఎల్ రాష్ట్ర మహాసభల వాల్‌పోస్టర్లను మండల కేంద్రంలోని న్యూడెమోక్రసీ కార్యాలయంలో సంఘం నాయకులు ఆదివారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా పీవైఎల్ మండల అధ్యక్షుడు కల్తి వెంకన్న మాట్లాడుతూ ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రశ్నించడం, అందుకు వ్యతిరేకంగా ఉద్యమించేందుకు యువత సిద్ధంగా ఉండాలని అన్నారు. ఖమ్మం జిల్లా కేంద్రంలో జరిగే మహాసభలకు యువత అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సమ్మయ్య, సాంబరాజు, సురేష్ పాల్గొన్నారు.



కొత్తగూడ: వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో గురువులతో విద్యార్థులు

దంతాలపల్లి: మండలకేంద్రంలోగల జిల్లా ప్రజా పరిషత్ సెకండరీ పాఠశాలలో 1996–97 బ్యాచ్ 10వ తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. తాము చదివిన పాఠశాలలో నాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో గురువులు రామయ్య, లలిత, సుధాకర్, వేణుమాధవ్, శ్రీనువాస్‌రెడ్డి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మకు బోనాలు

బయ్యారం: మండలంలోని చోక్లాతండాలో బొడ్రాయి ప్రతిష్ఠించి సంవత్సరం పూర్తయిన సందర్భంగా తండావాసులు గ్రామదేవతైన ముత్యాలమ్మకు ఆదివారం బోనాలు సమర్పించారు. మహిళలు తమను సల్లంగ చూడాలని బోనాలతో బయలుదేరి దేవతకు మొక్కులు చెల్లించారు. చల్లంగా చూడు తల్లి అని వేడుకున్నారు. గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో వెంకట్రాంపురం సర్పంచ్ బాణోత్ నీలమ్మరామునాయక్, తండావాసులు పాల్గొన్నారు.



బోనాలతో వెళ్తున్న మహిళలు

ఇళ్లు ఇవ్వలేదని నాయకులతో వాగ్వాదం

దంతాలపల్లి: పెద్దముప్పారం గ్రామంలో వివిధ అభివృద్ధి పనుల శంకుస్థాపనకు వచ్చిన ఎమ్మెల్యే రెడ్యానాయక్ గ్రామ సందర్శనలో విప్పలగడ్డ కాలనీకి చెందిన మహిళలు తమకు ఇళ్లు ఎప్పుడు కట్టిస్తారని నాయకులను నిలదీశారు. సందర్భంగా వారు మాట్లాడుతూ.. సొంత స్థలంలో ఇళ్లు కట్టిస్తామని ఒక్కొక్కరి వద్ద లక్ష యాభై వేలు వసూలు చేసి 4 ఏళ్లు గడుస్తున్న ఇంతవరకు ఇళ్లు నిర్మించలేదని వాపోయారు. కార్యక్రమంలో సాధు సోమక్క, వీరమ్మ, రమా పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలకు సబ్‌సెంటర్లు

ఖానాపురం : గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి హెల్త్ సబ్‌సెంటర్ల నిర్మాణాలు చేయిస్తున్నారని వైస్ ఎంపీపీ రామసహాయం ఉమారాణి, సర్పంచ్ గొర్రె కవితారవి అన్నారు. ఈ మేరకు మండలంలోని అశోక్‌నగర్‌లో ఎన్‌హెచ్‌ఎం నిధులు రూ.20లక్షలతో హెల్త్ సబ్ సెంటర్ నిర్మాణ పనులను ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఈ రత్నాకర్, ఉపసర్పంచ్ రాములు, వెంకన్న, వెంకటయ్య పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవు



గూడూరు: ఫర్టిలైజర్ అండ్ పెస్టిసైడ్ షాపుల యజమానులు నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవని ఎస్సై బి.రాణాప్రతాప్ హెచ్చరించారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం మండలంలోని షాపుల యజమానులకు విత్తన విక్రయాలపై అవగాహన కల్పించారు. అదేవిధంగా ఇతర జిల్లాల నుంచి నాణ్యమైన విత్తనాలంటూ ఎవరైనా విత్తనాల ప్యాకెట్‌లు విక్రయిస్తే వారిపై సమాచారం అందించాలని సూచించారు. నిబంధనలు అతిక్రమించినా, ఫిర్యాదు వచ్చినా వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయన్నారు.